# గౌతమీగాథలు

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

# పండితమ్మన్యులు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక చోట ఉపాధ్యాయ పండితు లంతాకలిసి- తమ స్వేచ్ఛళ్ళు. ఎగుడుదిగుళ్ళు. చర్చించి తమ బాగోగులు ప్రభుత్వానికి తెలుపుకోడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దానికి నాటి విద్యాశాఖాధికారిని అధ్యక్షులుగా ఆహ్వానించారు.

విద్యాశాఖాధికారిగారు తమ పరివారంతో సభకు దయచేసి అధ్యక్షత వహించారు.

కన్వీనరు సమావేశ వుద్దేశాలు తెలిపి కూర్చున్నాడు. విద్యాశాఖాధికారిపండితుల మీదగౌరవం, సానుభూతికలవాడు. అధ్యక్షోపన్యాసం ప్రారంభిస్తూ "పండితంమన్యులారా ! మీ కష్టనిష్ఠురాలు నాకు తెలుసు.." అనేసరికి సభలో వాళ్ళంతా 'పండితులు' గనక, ఎంత అణుచుగున్నా ఆగక పక్కున నవ్వేశారు. అధికారి నివ్వెరబోయాడు. తన మాటలో ఏదో తిరకాసు వుందని గ్రహించాడు. గడుసువాడు, వెలితి కనపడకుండా, వెలవెల బోకుండా, నిలదొక్కుకుని తొలిపలుకులు పూర్తి చేసినా- తనవల్ల సహాయం పొందదలచినవారు అలా నవ్వడమేనా అని లోపల్లోపల మండిపడ్డాడు. వీళ్ళ భరతంపట్టా లనుకున్నాడు. పర్యవసానం ఏమయిందో తెలియదుగాని మొత్తాని కది అధ్యక్షోపన్యాసం అయింది.

లోకంలో తనకు రాని భాషమీద వల్లమాలిన మోజు. అది ఎక్కడ బెడిసి కొడుతుందో తెలియదు.

హైస్కూల్లో ఏడాది కొకసారి డి.ఇ.ఓ ఇన్‌స్పెక్షన్ జరుగుతూ ఉంటుంది. నేను చేరిన కొత్తరోజుల్లో డి.ఇ.ఓ.ను దొరగారు అనేవారు. ఆ దొరగారితో "తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధ వ్రాతమున్ "అన్నట్టు ఆ రేంజిస్కూళ్ళ ఇన్‌స్పెక్టర్లుకూడా వుంటారు. దొరగారు పెద్దక్లాసుల్లో పెద్ద సబ్జెక్టులు - అంటే ఇంగ్లీషు వగైరా చూస్తూవుంటే 'చిల్లర దేవుళ్ళు' చిన్న సబ్జెక్టులు - అంటే తెలుగు వగైరా చూస్తూ వుంటారు.

అందరికీ లోకువైనది తెలుగు - ఎవరైనా చూడవచ్చు. ఏమైనా అనవచ్చు.

స్కూల్లో ఒక మూలగదిలోవుంటుంది ఆ క్లాసు. ఇన్‌స్పెక్షన్ రోజుల్లో నైనా అటువైపు ఎవ్వరూ వెళ్ళరు. ఆ గదిలోంచిభూత వైద్యుడి మంత్రాల్లా, లట్, లిట్. లుట్. ల్పట్. అని వినవడుతూ ఉంటే ఎవరికైనా తలనొప్పి. కాని— నూటికీ కోటికీ ఏ ఆదినారాయణవంటి డి ఇ ఓ.లో వచ్చి సంస్కృతం పాఠాలుగూడా విని ఆనందించడం కద్దు.

ఒకసారి ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది. రెండు రోజులు నిర్విరామంగా పర్యవేక్షణ సాగించారు.

మూడవరోజు తుదిరోజు.

ఇన్‌స్పెక్షన్ ముగింపుకు వచ్చింది.

ఆ సాయంత్రం పర్యవేక్షకుల నివేదికలు, దొరగారిసూచనలు, తుదిని టీపార్టీ.

దొరగారివెంట వచ్చిన పి. పి. శాస్త్రి గారు సీనియర్ ఇన్‌స్పెక్టరు. వారికి హఠాత్తుగా సంస్కృతం క్లాసు చూడాలనిపించింది. నేను సంస్కృతం క్లాసులోవుండగా వచ్చారు.

అది స్కూల్‌ఫైనల్ సంస్కృతం.

ప్రత్యుత్థానాదు లయాయి.

ఆయనకు తెలుగులో బాగా ప్రవేశం వుందని నమ్మకం. ఆ మాత్రం సంస్కృతం పరీక్షించలేమా ? అనుకున్నారు.

ఇన్‌స్పెక్షన్‌కు వచ్చినవారు టీచరును పాఠం చెప్పమనవచ్చు. లేక పాత పాఠాలలోనే ప్రశ్నలు వెయ్యమనవచ్చు.

అయితే- టీచరు వేసిన ప్రశ్నలకు విద్యార్థులు చెప్పిన ఆన్సర్లు రైటో, తప్పో తెలియాలి. లేకపోతే- టీచరు మర్యాదకు ఊరుకున్నా విద్యార్థులే నవ్వుతారు.

ఇన్‌స్పెక్టర్‌గారు ప్రశ్నలు వెయ్యమన్నారు. పాఠ్యగ్రంథంలో కంఠస్థం చెయ్యవలసిన శ్లోకాలు ఉంటాయి. అందులో రెండు ఇద్దరిచేత చదివించి అర్థం చెప్పమన్నాను. చెప్పారు. ఆ సీతులు తెలిసినవే గనక పేచీలేకుండా నడిచిపోయింది. ఆ క్లాసులో ఒక ఆడపిల్ల వుంది. ఆమెను ప్రశ్నించ మన్నారు. ఆ అమ్మాయిని కొన్ని శబ్దాలకు విభక్తులు, కొన్ని మాటలకు అర్థాలు అడిగాను. కొన్ని తప్పులుచెప్పినా నేను మాట్లాడలేదు. ఇన్‌స్పెక్టరుగారు జవాబులకు సంతోషించారు. "వీళ్ళకు వ్యాకరణం వుందా ? అన్నారు.

"ఉంది" అన్నాను.

ఆయన చట్టున ఏదీ జ్ఞాపకం రాక వాళ్ల చదివిన శ్లోకంలో ఒక ముక్క తీసుకుని "ఇది ఏ సమాసం? విగ్రహం ఏమిటి?" అని యింక తానే రంగంలోకి దిగారు. సరే యిక ముగియవచ్చింది గదా అని సంతోషించాను.

"విగ్రహం చెప్పగలరు- సమాసాలు సిలబస్‌లో లేవు. అయినా వాళ్ళ పరిజ్ఞానానికి చెబుతూ ఉంటాను." అన్నాను.

"మంచిది- సిలబస్‌లో లేకపోతేనేం ? చెప్పాలి" అన్నారు.

"చిత్తం."

లేచారు. ఆడపిల్లను "అమ్మాయీ, సమాసానికీ, సమాసోక్తికీ తేడా ఏమిటి ? ఆ మాటకు సమాసం చెప్పావుసరే- సమాసోక్తి కూడా చెప్పు" అన్నారు. పిల్ల తెల్లబోయింది.

నే నన్నాను నవ్వుతూ - "ఇన్‌స్పెక్టరుగారు మిమ్మల్ని పరీక్షిస్తున్నారు. సమాసోక్తి అలంకారం. అది సమాసాల్లో వుండదు అని వారికి తెలుసు. అన్నాను-" పిల్లవేపు తిరిగి-

ఇప్పుడు తెల్లబోవడం ఇన్‌స్పెక్టరుగారి వంతయింది. తీవిగా లేచి వెళ్ళిపోయారు మీటింగుకు.

